
సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం

శనివారం : 27 : సెప్టెంబర్ : 2025



కాయ కుళ్లి.. పూతలు రాలి..
జిల్లాలో రెండు నెలలుగా కురుస్తున్న వర్షాలకు కాయ కుళ్లి, పూత రాలి పత్తి చేలు దెబ్బతింటున్నాయి. IIలో



పెరుగుతున్న గోదావరి
ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు గోదావరితోపాటు కిన్నెరసాని, తాలిపేరు ప్రాజెక్ట్‌లోకి వరద చేరుతోంది. IIలో

గరిష్టం / కనిష్టం
28° / 24°

వాతావరణం
జిల్లాలో శనివారం సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. సాయంత్రం అక్కడక్కడా జల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

అంగన్‌వాడీ కేంద్రాలకు సెలవులు

ఈ నెల 27 నుంచి వచ్చే నెల 5 వరకు

కొత్తగూడెంటౌన్: అంగన్‌వాడీ కేంద్రాలకు ఈ నెల 27వ తేదీ నుంచి అక్టోబర్ 5వ తేదీ వరకు ఎనిమిది రోజులపాటు ప్రభుత్వం దసరా సెలవులు ఇచ్చింది. కేంద్రాలకు వచ్చే చిన్నారులు, గర్భిణులు, తల్లులకు రోజూ అందిస్తున్న మెనూ, పోషకాహారంలను టేక్ హోంతో ఇళ్లకు అందజేస్తామని ఐసీడీఎస్ అధికారులు తెలిపారు. అంగన్‌వాడీలకు మొదటిసారిగా సెలవులను ఇవ్వడంతో టీచర్‌లు, ఆయాలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం ప్రకటించినట్లు అంగన్‌వాడీ సిబ్బందికి సెలవులు ఇచ్చామని, జిల్లా సంక్షేమశాఖ అధికారి స్వర్ణలత లెనీనా తెలిపారు.

భూసేకరణకు సర్వే



గుండెపుడిలో భూ సర్వే నిర్వహిస్తున్న సిబ్బంది

జూలూరుపాడు: సీతారామ ప్రాజెక్ట్ డిస్ట్రిబ్యూటరీ కాల్వల నిర్మాణం కోసం శుక్రవారం గుండెపుడి, రామచంద్రాపురం గ్రామాల్లో భూసేకరణ సర్వే చేపట్టారు. ఈ సందర్భంగా ఇరిగేషన్ ఏఈఈ గోపాల్ రెడ్డి మాట్లాడుతూ 16 ఆర్ డిస్ట్రిబ్యూటరీ కెనాల్ ప్యాకేజీ–2 కింద భూసేకరణకు సర్వే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మండలంలోని చెరువులకు, సీతారామ ప్రధాన కాలువను సంధానం చేసేందుకు డిస్ట్రిబ్యూటరీ కెనాల్స్ నిర్మించనున్నట్లు పేర్కొన్నారు. జూలూరుపాడు సొసైటీ చైర్మన్ కొమ్మినేని పాండురంగారావు, కాళ్లూరు ప్రవీణ్ కుమార్, ఆనగంటి ధనమయ్య, రైతులు పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికలు పారదర్శకంగా నిర్వహించాలి



శిక్షణ తరగతుల్లో సూచనలు చేస్తున్న ఉపాధి కల్పనాధికారి శ్రీరామ్


చుంచుపల్లి: స్థానిక సంస్థల ఎన్నికల విధుల్లో పాల్గొనే అధికారులు, సిబ్బంది పారదర్శకంగా పోలింగ్ జరిగేందుకు కృషి చేయాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఎం.విద్యాచందన, జిల్లా ఉపాధికల్పనాధికారి శ్రీరామ్, జెడ్పీ సీఈఓ నాగలక్ష్మి సూచించారు. శుక్రవారం ఐడీఓసీలో ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల స్టేజ్ –1 రిటర్నింగ్ అధికారులు, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అధికారులు, సిబ్బంది సమన్వయంతో వ్యవహరించాలని అన్నారు. డివిజన్ల వారీగా ఏర్పాటు చేసిన వాట్సాప్ గ్రూపుల్లో సంబంధిత ఆర్వోలు, ఏఆర్వోలు సందేహాలను నివృత్తి చేసుకోవాలని సూచించారు. 180 మందికి శిక్షణ నిర్వహించారు. గ్రామ పంచాయతీల ఎన్నికల విధులకు హాజరయ్యే ఆర్వోలు, ఏఆర్వోలకు కొత్తగూడెం క్లబ్‌లో శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో 742 మందికి అవగాహన కల్పించారు. డీఎల్‌పీఓలు ప్రభాకర్, సుధీర్, ఏఓ రమణ, పుల్లయ్య పర్యవేక్షించారు.

వంద శాతం పీఎల్‌ఎఫ్ సాధించాలి

పాల్వంచ: విద్యుదుత్పత్తిలో వంద శాతం పీఎల్‌ఎఫ్(ప్లాంట్ లోడ్ ఫ్యాక్టర్) సాధించేలా కృషి చేయాలని జెన్ కో (థర్మల్) వై.రాజశేఖర్ రెడ్డి అన్నారు. శుక్రవారం 800 మెగావాట్ల సామర్థ్యం కలిగిన కేటీపీఎస్ 7వ దశ కర్మాగారాన్ని ఆయన ఎఫ్‌ఏ సీసీఎం (అకౌంట్స్) జి.సత్తిరాజుతో కలిసి సందర్శించారు. యాష్ పాండ్, యాష్ ప్లాంట్, సైలోస్‌లలో పర్యటించారు. అనంతరం అధికారులతో ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశంలో మాట్లాడారు. నాణ్యతతో కూడిన విద్యుత్ ఉత్పత్తే లక్ష్యంగా, విధుల్లో క్రమశిక్షణతో పనిచేయాలని సూచించారు. మెయింటెనెన్స్ సక్రమంగా ఉంటేనే ఉత్పత్తిలో అంతరాయాలు నివారించవచ్చన్నారు. కార్యక్రమంలో జనరేషన్ సీఈ రత్నాకర్, 7వ దశ సీఈ శ్రీనివాసబాబు, ఎస్‌ఈలు రాజ్‌కుమార్, కె.కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

'ప్రభాత సుమాలు' గ్రంథానికి గుర్తింపు

అశ్వారావుపేటరూరల్: అశ్వారావుపేటకు చెందిన సాహితీవేత్త సిద్ధాంతపు ప్రభాకరాచార్యులు రచించిన పరిశోధనా గ్రంథం ప్రభాత సుమాలుకు అంతర్జాతీయ ప్రామాణికత గ్రంథ గుర్తింపు లభించింది. ఈ మేరకు శుక్రవారం కేంద్ర ఉన్నత విద్యా మంత్రిత్వ శాఖ పరిధిలోని రాజారామమోహన్‌రాయ్ ఐఎస్‌బిఎన్ ఏజెన్సీ నుంచి అధికారికంగా లేఖ వచ్చినట్లు రచయిత తెలిపారు. కాగా, ఈ గ్రంథాన్ని సురవరం ప్రతాపరెడ్డి విశ్వవిద్యాలయం ఆర్థిక సహకారంతో ముద్రించి నవంబర్‌లోపు పాఠకులకు అందుబాటులోకి తెస్తామని పేర్కొన్నారు.



రామయ్య చెంత రైలు కూత!

అన్ని అనుకూలిస్తే భద్రగిరివాసుల దశాబ్దాల కల వాస్తవరూపం దాల్చనుంది. రైల్వే శాఖ చిత్రపటంలో భద్రాచలం పేరు కనిపించనుంది. భద్రాచలం–మల్కాన్‌గిరి రైల్వే లైన్ ఏర్పాటుతో రామ భక్తుల ముచ్చట కూడా తీరనుంది. గోదావరికి ఇరువైపులా ప్రతిపాదించిన రైల్వే స్టేషన్ల సర్వేలో మార్పులు జరగనున్నట్లు తెలుస్తోంది. ఇటువైపు సారపాకలో, అటువైపు తాజాగా భద్రాచలంలో అంతర్భాగంగా ఉన్న రాజుపేటలో ఏర్పాటు చేయనున్నట్లు తెలుస్తుండగా, రైల్వే అధికారులు ధ్రువీకరించాల్సి ఉంది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ సరిహద్దులతో ఇమిడి ఉన్న రాజుపేటలో ఏ ప్రాంతంలో రైల్వే స్టేషన్ రానుందోనని అందరూ ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు.

–భద్రాచలం

రాజుపేటలో భద్రాచలం రైల్వే స్టేషన్!
- భద్రగిరి–మల్కాన్‌గిరి రైల్వే లైన్‌లో మార్పులు జరిగే అవకాశం
- ధ్రువీకరించాల్సిన రైల్వే శాఖ అధికారులు

భద్రాచలం స్టేషనే కీలకం

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, ఒడిశాలలో రవాణా, ప్రయాణికుల కోసం మల్కాన్‌గిరి–భద్రాచలం రైల్వే లైన్ ప్రతిపాదించారు. రైల్వే మార్గంలో అనేక గిరిజన గ్రామాలు అనుసంధానించనున్నారు. ఇందుకోసం సుమారు 173 కిలోమీటర్ల మేర లైన్, పలు చోట్ల భారీ వంతెనలు, అండర్ బ్రిడ్జిల నిర్మాణాలకు ప్రణాళికలు రూపొందించారు. ఒడిశాలోని జేపూర్ వరకు, అక్కడి నుంచి మల్కాన్‌గిరి వయా భద్రాచలం వరకు ఈ లైన్ ఉంటుందని గతంలో అధికారులు పేర్కొన్నారు. భద్రాచలం నుంచి పాండురంగాపురం రైల్వే స్టేషన్‌ను అనుసంధానం చేస్తూ సారపాకలో రైల్వే స్టేషన్‌కు ప్రతిపాదించారు. నిర్మాణానికి తొలుత సుమారు రూ. 2,800 కోట్లు, ఆ తర్వాత రూ.3,592 కోట్లు వ్యయకానుందని అంచనా వేశారు. దక్షిణ అయోధ్యగా పేరుగాంచిన భద్రాచలానికి ఇప్పటివరకు రైల్వే కనెక్టివిటీ లేదు. ఈ రైల్వే లైన్ వస్తే భద్రాచలానికి దేశ వ్యాప్తంగా రైల్వే రవాణా భక్తులకు అందుబాటులో రానుంది.

రామాలయానికి కూతవేటు దూరంలో..

గతంలో ఒడిశాలోని మల్కాన్ గిరి, బదలి, కోవాసిగూడ, రాజన్‌గూడ, మహారాజ్ పల్లి, లూనిమన్‌గూడ స్టేషన్‌లు, ఆంధ్రప్రదేశ్‌లోని కన్నాపురం, కుట్టుగుట్ట, పల్లు, నందిగామల గుండా భద్రాచలంలో ప్రవేశించేట్లు రైల్వే లైన్ పనులు కొనసాగించారు. ఈ నేపథ్యంలో రైల్వే స్టేషన్ భద్రాచలానికి సుమారు 10 కిలోమీటర్ల పరిధిలో ఉండే ఏపీలోని యటపాక, పిచుకలపాడు తదితర గ్రామాల వద్ద ఏర్పాటయ్యే అవకాశం ఉందని ప్రచారం సాగింది. తాజాగా స్టేషన్ భద్రాచలం పరిధిలో ఉన్న రాజుపేటలోకి మారినట్లు సమాచారం. ఏపీలోని చింతూరు మండలం కుయుగూరు, కూనవరం మండలంలోని సీతారామపురం, భీమవరంలో రైల్వే స్టేషన్ల ప్రతిపాదన కూడా వచ్చింది. భద్రాచలం శివారు రాజుపేట గ్రామంలో రైల్వే స్టేషన్ ఏర్పాటు చేయనున్నట్లు తెలుస్తోంది. శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థానానికి కూత వేటు దూరంలో రైల్వే స్టేషన్ రానుండటంతో భక్తులు, భద్రాచలం వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఏపీ, తెలంగాణలో ఉమ్మడిగా రాజుపేట

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో రాజుపేట భద్రాచలం శివారు ప్రాంతంగా ఉండేది. రాష్ట్ర విభజన అనంతరం గ్రామం రెండు ముక్కలయింది. రెండు రాష్ట్రాల సరిహద్దుగా మారింది. ఇక్కటి ప్రజలకు తెలంగాణలో ఇళ్లు, ఏపీలో పొలాలు ఉన్నాయి. రాజుపేటలో రైల్వేస్టేషన్ ఏర్పాటు చేస్తే ఇటు తెలంగాణలోనా, అటు ఆంధ్రప్రదేశ్‌లోనా అనే సస్పెన్స్ నెలకొంది. ప్రభుత్వ, ప్రైవేట్ ఖాళీ స్థలాలు అత్యధికంగా ఏపీలోనే ఉన్నాయి. దీంతో దాదాపు ఏపీలోని రాజుపేటలోనే నెలకొనే అవకాశం ఉంది. ఈ విలీన గ్రామపంచాయతీ ప్రజలు ఎన్నో రోజుల నుంచి తమ గ్రామాలను తిరిగి తెలంగాణలో కలపాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ డిమాండ్‌ను కేంద్ర ప్రభుత్వం నెరవేర్చితే రైల్వే స్టేషన్‌ను ఏ రాజుపేటలో ఏర్పాటు చేసినా తెలంగాణ పేరు మీదుగానే చరిత్రలో నిలిచే అవకాశం ఉంది.

విద్య, ధన ప్రాప్తిరస్తు

- వైభవంగా సాగుతున్న నవరాత్రి ఉత్సవాలు
- నేడు ధాన్యలక్ష్మి అలంకరణలో అమ్మవారు



ధనలక్ష్మి అలంకరణలో అమ్మవారు

భద్రాచలం: విద్యాధనం, హిరణ్య ధనం, శక్తి ధనంలను ప్రసాదించే ధనలక్ష్మిగా శ్రీ లక్ష్మీతాయారు అమ్మవారు శుక్రవారం భక్తులకు దర్శనమిచ్చి అభయమిచ్చారు. భద్రాచల శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థానంలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. అమ్మవారికి ఉదయం అభిషేకం, ప్రత్యేక పూజలను గావించారు. లక్ష్మీ తాయారు అమ్మవారి ఆలయంలో మధ్యాహ్నం సామూహిక కుంకుమార్చన జరిపారు. చిత్రకూట మండపంలో వేద పండితులు, అర్చకులు అరణ్య కాండ పారాయణం చేశారు.

ధాన్యలక్ష్మి అలంకార విశిష్టత

అమ్మవారిని శనివారం ధాన్యలక్ష్మిగా అలంకరించనున్నారు. అన్ని రకాల ధాన్యాన్ని ప్రసాదించేది అమ్మవారేనని, అమ్మవారిని ఆరాధిస్తే ఈతి బాధలన్నీ తొలగి, సమయానికి తగిన వర్షాలు కురిసి దేశం సస్యశ్యామలంగా, సుభిక్షంగా ఉంటుందని పండితులు పేర్కొంటున్నారు.

కనుల పండువగా కల్యాణం

స్వామివారికి బేడా మండపంలో నిత్యకల్యాణం కనుల పండువగా జరిగింది. తొలుత తెల్లవారుజామున గర్భగుడిలో స్వామి వారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం నిత్యకల్యాణానికి బేడా మండపంలో కొలువుదీరిన స్వామివారికి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం చేశారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా జరిపారు.

అలరించిన నృత్య ప్రదర్శన

భద్రాచలంటౌన్: శ్రీసీతారామచంద్ర స్వామివారి దేవస్థానంలో శుక్రవారంనిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. మైత్రి ఫైన్ ఆర్ట్స్ మద్రాస్ ఆధ్వర్యంలో సరళ కుమారి నేతృత్వంలో చిత్రకూట మండపంలో నిర్వహించిన సీతారాముల కల్యాణ నిత్య రూపకం ప్రేక్షకులను ఆకట్టుకుంది. చిన్నారుల నృత్యం చూపరులను మంత్రముగ్ధులను చేసింది.

శ్రీ మహాలక్ష్మీదేవిగా పెద్దమ్మతల్లి



శ్రీ మహాలక్ష్మీదేవి అలంకరణలో పెద్దమ్మతల్లి అమ్మవారు

పాల్వంచరూరల్: మండల పరిధిలోని పెద్దమ్మతల్లి ఆలయంలో శ్రీదేవీ శరన్నవరాత్రుల మహోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. శుక్రవారం పెద్దమ్మతల్లి అమ్మవారు శ్రీ మహాలక్ష్మీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. భక్తుల అష్టకష్టాలను పారదోలి, అష్టైశ్వర్యాలను ఇచ్చి, ముల్లోకాలకు సర్వమంగళాలు ప్రసాదించే ధనదాయిని శ్రీమహాలక్ష్మీ అమ్మవారని అర్చకులు అలంకరణ విశిష్టతను వివరించారు. అనంతరం శ్రీకనకదుర్గమ్మ అమ్మవారికి అర్చకులు 108 కలశాలతో అష్టోత్తర కలశాభిషేక పూజలు నిర్వహించారు.

ఐటీడీఏ డీడీ మణెమ్మకు పదోన్నతి

భద్రాచలంటౌన్: భద్రాచలం ఐటీడీఏలో డీడీగా పనిచేస్తున్న మణెమ్మకు జేడీగా పదోన్నతి లభించింది. ఈ మేరకు గిరిజన సంక్షేమ శాఖ నుంచి శుక్రవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. భద్రాచలం ఐటీడీఏలో 2023 జూలై 7న డిప్యూటీ డైరెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించారు. అధికారులు మణెమ్మకు పదోన్నతి కల్పిస్తూ గిరిజన సంక్షేమ శాఖ హైదరాబాద్ హెడ్ ఆఫీస్‌లో జాయింట్ డైరెక్టర్‌గా బాధ్యతలు అప్పగించారు.

ఏసీబీకి చిక్కిన మణుగూరు ఎస్‌ఐ

స్టేషన్ బెయిల్‌కు రూ.40వేల లంచం డిమాండ్



ఏసీబీకి పట్టుబడిన ఎస్‌ఐ రంజిత్

మణుగూరు టౌన్: కారు చోరీ కేసులో స్టేషన్ బెయిల్ ఇచ్చేందుకు రూ.40వేల లంచం డిమాండ్ చేసిన మణుగూరు ఎస్సై రంజిత్‌ను ఏసీబీ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. కేసులో ఇద్దరు నిందితులు స్టేషన్ బెయిల్ కోసం కొన్నాళ్ల క్రితం ఎస్సైను ఆశ్రయించారు. ఇందుకోసం ఆయన రూ.40 వేలు డిమాండ్ చేశాడు. కొద్దిమేర తగ్గించాలని కోరినా ఎస్సై ససేమిరా అనడంతో వారు ఏసీబీ అధికారులు ఆశ్రయించారు. ఆపై గతంలోనే డబ్బు ఇచ్చేందుకు వచ్చినా అనుమానంతో తీసుకోలేదు. ఈమేరకు ఫిర్యాదుదారుల నుంచి సేకరించిన ఆడియో, వీడియో రికార్డింగ్‌ల ఆధారంగా ఎస్సై రంజిత్‌పై 7బీ కింద కేసు నమోదు చేసి రిమాండ్ చేసినట్లు కరీంనగర్ ఏసీబీ డీఎస్పీ విజయ్‌కుమార్ తెలిపారు. తనిఖీల్లో ఖమ్మం ఏసీబీ సీఐలు శేఖర్, కృష్ణకుమార్ పాల్గొన్నారు.

ప్రకృతి సంపదను కాపాడుకోవాలి

అరుణోదయ సాహితీ సాంస్కృతిక సమాఖ్య అధ్యక్షురాలు విమలక్క



బతుకమ్మ ఆడుతున్న విమలక్క తదితరులు

గుండాల : ప్రజలు ప్రకృతి సంపదను కాపాడుకోవాలని అరుణోదయ సాహితీ సాంస్కృతిక సమాఖ్య అధ్యక్షురాలు విమలక్క పిలుపునిచ్చారు. శుక్రవారం మండలంలోని జయశంకర్ నగర్ యాపలగడ్డ గ్రామంలో బహుజన బతుకమ్మ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉత్సాహంగా బతుకమ్మ ఆడి బహుజన బతుకమ్మ ఆవశ్యకతను ప్రజలకు వివరించారు. ప్రకృతి రక్షణ, ప్రజలకు రక్షణగా బహుజన బతుకమ్మ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా తొమ్మిది రోజులు బహుజన బతుకమ్మ కార్యక్రమాన్ని నిర్వహించి ప్రజలను చైతన్యవంతం చేస్తున్నామని చెప్పారు. ఈ సంవత్సరం కూడా ఉస్మానియా ఆర్ట్స్ కాలేజీ ప్రాంగణంలో ఆటపాట మాటతో ప్రారంభించి చివరిగా ఉప్పల్ మండల కేంద్రంలో ముగింపు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అరుణక్క, రుద్ర. మల్సూర్, సమ్మయ్య పాల్గొన్నారు.

'జల్ సంచయ్'లో ప్రత్యేక గుర్తింపు

జిల్లాకు రూ. 25 లక్షల నగదు బహుమతి



ఇంకుడు గుంతను తవ్వుతున్న కలెక్టర్ జితేష్ వి.పాటిల్(ఫైల్)

చుంచుపల్లి: దేశవ్యాప్తంగా వర్షపు నీటి సంరక్షణ కార్యక్రమాల్లో తెలంగాణ రాష్ట్రం అగ్రస్థానంలో నిలవడంతోపాటు జిల్లాకు ప్రత్యేక గుర్తింపు రావడం గర్వకారణమని కలెక్టర్ జితేష్ వి.పాటిల్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆయన వివరాలు వెల్లడించారు. కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో అమలవుతున్న జల్ సంచయ్ జన్ భాగీదారీ 1.0 కార్యక్రమంలో జిల్లాకు రూ.25 లక్షల నగదు బహుమతి లభించిందన్నారు. జిల్లాలో 32,000 నిర్మాణాలు చేపట్టి 29,103 నీటి సంరక్షణ పనులు పూర్తి చేశామని తెలిపారు. ఇంకుడు గుంతలు, నీటికుంటలు, రూఫ్ వాటర్ హార్వెస్టింగ్, ఊట చెరువులు వంటి వర్షపు నీటి సంరక్షణ పనులు పట్టణ ప్రాంతాలకు కూడా ఉపయుక్తంగా మారాయని పేర్కొన్నారు. ప్రజల సహకారం, స్థానిక సంస్థల భాగస్వామ్యం, గ్రామీణ అభివృద్ధి సంస్థల కృషితో ఈ విజయాన్ని సాధించగలిగామని అన్నారు.

పిల్లాపాపలతో రేయింబవళ్లు దీక్ష



కలెక్టరేట్ వద్ద ధర్నాచౌక్‌లో దీక్ష చేస్తున్న రామన్నగూడెం ఆదివాసీలు

- ధర్నాచౌక్‌లో ఐదురోజులుగా ఆందోళన చేస్తున్న ఆదివాసీలు
- దోమలతో జ్వరాల బారిన పడుతున్న అడవి బిడ్డలు
- కలెక్టరేట్‌లో నుంచి కన్నెత్తి చూడని అధికారులు

సూపర్‌బజార్(కొత్తగూడెం): మా భూమి మాకు అప్పగించాలని ఆదివాసీలు రేయింబవళ్లు దీక్షలు చేపడుతున్నారు. చెట్ల పొదలతో నిండి ఉన్న కలెక్టరేట్ ధర్నాచౌక్‌లో అశ్వారావుపేట మండలం రామన్నగూడెం ఆదివాసీలు ఆందోళన చేపట్టారు. ఐదు రోజులుగా అక్కడే దీక్ష చేపడుతున్నా.. జిల్లా ఉన్నతాధికారులంతా కలెక్టరేట్‌లోనే ఉంటున్నా అడవి బిడ్డల గోస ఎవరికీ పట్టడంలేదు. 250 మంది ఆదివాసీలు చిన్న పిల్లలతో విద్యుత్ సౌకర్యం, తాగునీటి సౌకర్యం లేకపోయినా ఆందోళన కొనసాగిస్తున్నారు. ధర్నాచౌక్‌లో పూర్తిగా అపరిశుభ్ర వాతావరణం, చెట్ల పొదలతో నిండి ఉండటంతో దోమలు, ఇతర కీటకాలు స్వైరవిహారం చేస్తున్నాయి. దోమల కారణంగా కొందరు వైరల్ ఫీవర్ బారిన పడ్డారు. ఇలాగే దీక్ష కొనసాగితే చాలామంది అనారోగ్యానికి గురయ్యే ప్రమాదం పొంచి ఉంది. చిన్న పిల్లలతో కూడా ఉండటంతో ఇబ్బందికర పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉంది. కాలకృత్యాలు తీర్చుకునేందుకు వారు పడుతున్న అవస్థలు చెప్పనలవి కాదు. ప్రధాన రాజకీయ పార్టీలు కూడా ఆందోళన వైపు దృష్టిసారించలేదు. అన్ని పార్టీలు ప్రజాసంఘాలు మద్దతు తెలిపి తమ భూసమస్యను పరిష్కరించాలని ఆదివాసీలు కోరుతున్నారు. రామన్నగూడెంలో 150 మంది ఆదివాసీ రైతులకు సంబంధించిన 573.20 ఎకరాల భూమి విషయంలో అటవీ, ఎఫ్‌డీసీ, రెవెన్యూ శాఖల మధ్య వివాదం నెలకొంది. భూములకు ప్రభుత్వం పాస్ పుస్తకాలు ఇచ్చిందని, హైకోర్టు సైతం తమకు అనుకూలంగా 2011లో తీర్పు చెప్పిందని, అయినా భూమి మాత్రం తమకు దక్కలేదని ఆదివాసీలు ఆవేదన చెందుతున్నారు.

మాజీ ఎమ్మెల్యే గుమ్మడి సంఘీభావం

దీక్షలకు ఇల్లెందు మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య దీక్షా శిబిరాన్ని సీపీఐ మాస్ లైన్ పార్టీ నాయకులతో కలిసి సందర్శించి సంఘీభావం ప్రకటించారు. ఎమ్మార్పీఎస్ జిల్లా కన్వీనర్ రవి మాదిగ తదితరులు దీక్షలను సందర్శించి మద్దతు తెలిపారు.



జ్వరాల బారిన పడ్డ ఆదివాసీలు

మాకు హక్కు కల్పించాలి



మా భూములపై హక్కు కల్పించాలి. తాత ముత్తాతల కాలం నుంచి పోరాటం జరుగుతోంది. మాకు పట్టాలు ఉన్నాయి. 573 ఎకరాల్లో 104 ఎకరాలు మాత్రమే మా ఆధీనంలో ఉన్నాయి. 180 మంది ఆదివాసీ రైతుల గోడును అధికారులు పట్టించుకోవాలి.

–మడకం నాగేశ్వరరావు, ఆదివాసీ సంక్షేమ పరిషత్ జిల్లా కార్యదర్శి

ఇక్కడి నుంచి కదలం



ఎన్ని కష్టాలు ఎదురైనా మా భూ సమస్య పరిష్కారం అయ్యేంత వరకు ఇక్కడి నుంచి కదలం. మాకు భూమిపై హక్కు కల్పించాలి. రెవెన్యూ, అటవీశాఖలు సమన్వయంతో మా సమస్యను పరిష్కరించాలి.

–ముడియం రమాదేవి

అధికారుల తీరు దారుణం



పిల్లా పాపలతో అనేక కష్టనష్టాలు ఎదుర్కొంటూ ఐదు రోజులుగా నిరాహార దీక్ష చేస్తుంటే అధికారులు స్పందించక పోవడం దారుణం. గత నెల 9న కొత్తగూడెం ఆర్డీఓ వచ్చి పది రోజుల్లో సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఇప్పటివరకు పరిష్కారం కాలేదు.

– కొర్స శ్రీను

భూమి చూపిస్తామని చెప్పాం



సమస్య పరిష్కారానికి గతంలో రామన్నగూడెం వెళ్లాం. పట్టాదారు పాసుపుస్తకాలు ఉన్నవారికి భూమిని చూపిస్తామని చెప్పాం. కానీ రెవెన్యూ పరిధిలో ఉన్న భూమి కాకుండా అటవీ శాఖ ఆధీనంలో ఉన్న భూమి విషయంలో సమస్య ఉంది.

–మధు, కొత్తగూడెం ఆర్డీఓ

'మద్యం' దరఖాస్తులకు ఏర్పాట్లు..

ఎక్సైజ్ సూపరింటెండెంట్ జానయ్య



మాట్లాడుతున్న జానయ్య

కొత్తగూడెంఅర్బన్: జిల్లాలో మద్యం దుకాణాల దరఖాస్తుల స్వీకరణకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ జానయ్య తెలిపారు. శుక్రవారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. 2025–27 నోటిఫికేషన్ ప్రకారం జిల్లాలో మొత్తం 88 వైన్ షాపులుండగా 44 ఎస్టీలకు, 31 జనరల్ కేటగిరీకి, ఎస్సీ 7, గౌడ్ 6 కేటాయించినట్లు చెప్పారు. దరఖాస్తుల స్వీకరణకు శుక్రవారం కౌంటర్లు ఏర్పాటు చేశామని, తొలి రోజు ఒక్క దరఖాస్తు కూడా రాలేదని అన్నారు. టెండర్‌లో పాల్గొనేందుకు గానూ రూ.3 లక్షల ఫీజును ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. గతేడాది 5,057 దరఖాస్తులు వచ్చాయని, ఈ ఏడాది అంతకంటే ఎక్కువ రావొచ్చని అన్నారు. అక్టోబర్ 18వ తేదీ వరకు గడువు ఉందని, 23న డ్రా తీస్తామని తెలిపారు. ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ ఎస్సై గౌతమ్, సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఐలమ్మ ఆశయసాధనకు కృషి చేయాలి


నివాళులర్పిస్తున్న కలెక్టర్, తదితరులు

సూపర్‌బజార్(కొత్తగూడెం): భూమి కోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరీ విముక్తి కోసం చాకలి ఐలమ్మ పోరాటం స్ఫూర్తిదాయకమని, ఆమె ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కలెక్టర్ జితేశ్ వి.పాటిల్ అన్నారు. కలెక్టరేట్‌లో వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం చాకలి ఐలమ్మ జయంతి నిర్వహించారు. మొదట కలెక్టర్ ఐలమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం ఉద్యమించారన్నారు. 1940 – 44 మధ్య కాలంలో విస్నూర్‌లో దేశ్‌ముఖ్, రజాకార్ల అరాచకాలపై ఎదురుతిరిగి పోరాడిన యోధురాలు ఐలమ్మ అని కొనియాడారు. తెలంగాణ రైతాంగ పోరాటంలో నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా పోరాటం చేసి మహిళల్లో స్ఫూర్తి నింపారని, ఆమె పోరాట స్ఫూర్తి తెలిపేందుకు రాష్ట్ర ప్రభుత్వం జయంతి వేడుకలను నిర్వహిస్తోందని వివరించారు. కార్యక్రమంలో బీసీ వెల్ఫేర్ అధికారి పి.విజయలక్ష్మి, బీసీ సంఘం నాయకులు నేరెళ్ల రమేశ్, అజిత్‌కుమార్, సర్వేశ్, కె.వసంతరావు, బి.శ్రీనివాస్, ఆర్.వెంకటయ్య, ఎం.భిక్షం, బి.జయమ్మ, కొదుమూరి సత్యనారాయణ, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రయత్నించడంలోనే విజయం ఉంటుంది..


విద్యార్థులను అభినందిస్తున్న ట్రెయినీ కలెక్టర్ సౌరభ్‌శర్మ

పాల్వంచ: ప్రయత్నం చేయడంలోనే విజయం దాగి ఉంటుందని, జీవితంలో ప్రయత్నం చేస్తే లక్ష్యాలు సాధించవచ్చని ట్రెయినీ కలెక్టర్ సౌరభ్‌శర్మ అన్నారు. శుక్రవారం స్థానిక శ్రీనివాస కాలనీ మినీ స్టేడియం టెన్నిస్ క్రీడా మైదానంలో ఈ నెల 21వ తేదీన జిల్లా టెన్నిస్ టోర్నమెంట్‌లో విజయం సాధించిన విద్యార్థులను అభినందించారు. హైదరాబాద్ ఓపెన్ నేషనల్ టెన్నిస్ అండర్–60లో రన్నరప్‌గా నిలిచిన అన్నం వెంకటేశ్వర్లు, ఆల్ ఇండియా నేషనల్ ఆర్చరీ విభాగానికి ఎంపికైన వంశీని అభినందించి, మాట్లాడారు. కార్యక్రమంలో ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ యుగంధర్‌రెడ్డి, టెన్నిస్ అసోసియేషన్ అధ్యక్షుడు వై.వెంకటేశ్వర్లు, సెక్రటరీ జకరయ్య, కోచ్ డానియేల్ రాంబాబు, భాస్కర్, కబీర్, దాట్ల రాజు, కుటుంబరావు, కృష్ణారావు, రాజ్‌కుమార్, సతీశ్, టెన్నిస్ క్రీడాకారులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ డ్రైవర్‌కు ఏడాది జైలు శిక్ష

భద్రాచలంఅర్బన్: బస్సుతో ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టి, ఓ వ్యక్తి మృతికి కారణమైన భద్రాచలం ఆర్టీసీ డిపోకి చెందిన డ్రైవర్ సూర్యనారాయణకు ఏడాది జైలుశిక్షతోపాటు రూ.1000 జరిమానా విధిస్తూ భద్రాచలం ప్రథమశేణి న్యాయమూర్తి శివనాయక్ తీర్పునిచ్చారు. ద్విచక్రవాహనంపై వస్తున్న సయ్యద్ సోహైల్‌ను 2017 డిసెంబర్ 12న బూర్గంపాడు సమీపంలోని సమక్క – సారలమ్మ గద్దెల వద్ద బస్సు ఢీకొట్టింది. సోహైల్ అక్కడికక్కడే మృతిచెందాడు. ఘటనకు సంబంధించి మృతుడి తల్లి సయ్యద్ హసీనాబేగం బూర్గంపాడు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేశారు. అనంతరం 2018లో కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. సోహైల్ మృతికి కారణమైన ఆర్టీసీ డ్రైవర్ సూర్యనారాయణకు ఏడాది జైలు శిక్షతో పాటు రూ.1000 జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.19,107

కరెన్సీ నోట్లతో అలంకరణ..

ములకలపల్లి/పాల్వంచ/ఇల్లెందురూరల్/: పాల్వంచ పట్టణంలోని శివనగర్–వికలాంగుల కాలనీ వాసుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మండపంలో శుక్రవారం అమ్మవారు ధనలక్ష్మిగా దర్శనమిచ్చారు. మండపాన్ని రూ.21లక్షల కరెన్సీ నోట్లతో ప్రత్యేకంగా అలంకరించారు. ములకలపల్లి ఉమా పృథ్వీ రామలింగేశ్వర స్వామి ఆలయం వద్ద ప్రతిష్ఠించిన అమ్మవారు శుక్రవారం ధనలక్ష్మి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో అమ్మవారిని రూ.5 లక్షల కరెన్సీ నోట్లతో అలంకరించారు. ఇల్లెందు మండలంలోని సుభాష్‌నగర్ రామాలయంలో మహాలక్ష్మిగా దర్శనమిచ్చిన అమ్మవారిని రూ.5 లక్షల కరెన్సీ నోట్లతో ప్రత్యేకంగా అలంకరించారు. మహిళలు కుంకుమ పూజలు నిర్వహించారు.


పాల్వంచ : అమ్మవారి మండపంలో కరెన్సీ నోట్లతో అలంకరణ


ములకలపల్లి: కరెన్సీ నోట్లతో దుర్గామాతను అలంకరించిన భక్తులు


ఇల్లెందురూరల్ : సుభాష్‌నగర్ రామాలయంలో..

కాయ కుళ్లి.. పూత రాలి..

వర్షాలకు దెబ్బతింటున్న పత్తిచేలు
- దిగుబడులపై రైతుల దిగులు
- పంట చేతికొచ్చే అదనులో వీడని వర్షాలు

బూర్గంపాడు: పంట చేతికొచ్చే సమయంలో కురుస్తున్న వర్షాలకు పత్తిరైతు కుదేలవుతున్నాడు. రెండు నెలలుగా కురుస్తున్న వర్షాలు పత్తిపంటపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. దసరాకు తొలివిడత పత్తి చేతికందే వేళ కురుస్తున్న వర్షాలకు పత్తికాయలు దెబ్బతింటున్నాయి. వర్షాలకు ఇప్పటికే మొక్కకు పది నుంచి ఇరవై కాయలు కుళ్లి నల్లబడిపోయాయి. భూమి ఆరకపోవటంతో తేమ ప్రభావంతో పత్తిలో పూత, పిందె రాలిపోతున్నాయి. జూన్, జూలై నెలల్లో ఆశాజనకంగా కనిపించిన పత్తి చేలు, ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో కురుస్తున్న వర్షాలకు దెబ్బతిని, దిగుబడులపై తీవ్ర ప్రభావం చూపుతుందని రైతులు వాపోతున్నారు. ఇప్పటికే ఎకరాకు రెండు క్వింటాళ్ల మేరా పత్తి వచ్చే కాయలు నల్లబడి కుళ్లిపోయాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షాలకు పూత, పిందె రాలిపోయి మొక్కలు ఎర్రబారుతున్నాయంటున్నారు.

2 లక్షల ఎకరాలకు పైగా..

ఈ ఏడాది జిల్లాలో సుమారు 2 లక్షల ఎకరాలకు పైగా విస్తీర్ణంలో రైతులు పత్తి సాగు చేశారు. కేంద్ర ప్రభుత్వం పత్తికి క్వింటాకు రూ.8,100 మద్దతు ధర ప్రకటించింది. సీసీఐ ఆధ్వర్యంలో పత్తి కొనుగోళ్లకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. దీంతో రైతులు జిల్లాలో ఎక్కువ విస్తీర్ణంలో పత్తి సాగు చేపట్టారు.


వర్షాలకు తెగుళ్లు సోకిన పత్తి చేను (ఇన్‌సెట్) వర్షాలకు కుళ్లి, నల్లబడిన పత్తికాయలు చూపుతున్న రైతు

జూన్‌లో సాగు చేసిన పత్తిపంట అడపాదడపా వర్షాలకు జూలై నెలాఖరు వరకు ఆశాజనంగా ఎదిగింది. ఆగస్టులో ఆరంభమైన వర్షాలు పత్తిపంటను క్రమేపీ దెబ్బతీస్తూ వస్తున్నాయి. ఇప్పటికే ఎకరాకు రెండు, మూడు క్వింటాళ్ల పత్తి రావాల్సి ఉండగా వర్షాలకు కాయలు దెబ్బతిన్నాయి. పక్వానికి వచ్చిన పత్తికాయలలోకి వర్షపు నీరు చేరి కాయలు నల్లబడి కుళ్లిపోతున్నాయి. పూత, పిందెలు కూడా రాలిపోతున్నాయి. వర్షాలతో పత్తి చేలకు బూజు తెగుళ్లు, పండు తెగుళ్లు ఆశించి ఆకులు రాలిపోతున్నాయి. కలుపు పెరిగిపోతోంది. సస్యరక్షణ చర్యలు చేపట్టేందుకు కూడా వర్షాలు అడ్డంకిగా మారాయి. రైతులు మందులు పిచికారీ చేసిన గంట, రెండు గంటల్లోనే వర్షాలు కురుస్తుండటంతో రైతులకు నష్టం కలుగుతోంది. అక్కడక్కడా పూసిన పత్తిని తీసేందుకు కూడా ఇబ్బందులు తప్పటం లేదు. వర్షాలకు కాయ గుల్లలో పత్తి ఇరుక్కుపోయి తీసేందుకు సరిగా రావటం లేదు. దీంతో ఎక్కువ మంది కూలీలను పత్తి తీసేందుకు పెట్టుకోవాల్సి వస్తోంది. క్వింటా పత్తి తీసేందుకు రూ.3 వేల వరకు ఖర్చు అవుతోందని రైతులు చెబుతున్నారు. ఒక్క కూలీ రోజుకు పదికిలోల పత్తి కూడా తీయలేకపోతున్నారు. తీసిన పత్తిని కూడా ఇళ్ల వద్ద ఆరబెట్టుకోవాల్సి వస్తోంది. వర్షాలకు రంగుమారిన పత్తిని వ్యాపారులు ఎవరు కొనుగోలు చేయటం లేదని రైతులు తెలిపారు.

పెరుగుతున్న పెట్టుబడి..

ఈ ఏడాది పత్తిపంటపై వర్షాలు తీవ్ర ప్రభావం చూపుతున్నాయని రైతులంటున్నారు. వర్షాలతో పంటకు పెట్టుబడులు పెరిగిపోతున్నాయని, ఎరువులు, సస్యరక్షణ ఎక్కువ సార్లు చేపట్టాల్సి వస్తోందని ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికే ఐదారుసార్లు పురుగుమందులు పిచికారీ చేశామని, నాలుగైదుసార్లు ఎరువులు వేసుకున్నామని అంటున్నారు. యూరియా కొరత కారణంగా రైతులు ఈ ఏడాది ఎక్కువగా కాంప్లెక్స్ ఎరువులు వినియోగించారు. ఎకరాకు రూ.3 వేల వరకు అదనంగా పెట్టుబడి పెరిగింది. ఇంకా పత్తి పంటకు ఐదారుసార్లు పురుగు, దోమ, తెగుళ్ల మందులు పిచికారీ చేసుకోవాల్సిన ఉంది. చేలలో కాయలు ఏమీ లేవని, వర్షాలు తగ్గి మళ్లీ కాస్తే తప్ప పత్తి చేతికి రాదని రైతులు వాపోతున్నారు. ఈ తరుణంలోనైనా పత్తిపంటను దక్కించుకునేందుకు సరిపడా యూరియా సరఫరా చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు. పత్తి చేలకు తెగుళ్లు ఆశిస్తున్నాయని, ఈ తరుణంలో శిలీంద్రనాశిని మందులు ఎక్కువగా వాడుకోవాలని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు. పత్తి పంటపై నానో యూరియా పిచికారీ చేసుకుంటే సరిపడా నత్రజని అందుతుందని వారు రైతులకు చెబుతున్నారు.

పెరుగుతున్న గోదావరి

దుమ్ముగూడెం: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా రాష్ట్ర వ్యాప్తంగా కురుస్తున్న వర్షాలకు మండలంలో గోదావరి పరవళ్లు తొక్కుతోంది. పర్ణశాల నారచీరల ప్రాంతం శుక్రవారం పూర్తిగా నీట మునిగింది. వరద పెరుగుతుండటంతో సున్నంబట్టి–బైరాగులపాడు గ్రామాల మధ్య రహదారి పైకి వరద నీరు చేరింది. భద్రాచలం–చర్ల ప్రధాన రహదారి తూరుబాక డైవర్షన్ రహదారి పైకి వరద నీరు చేరడంతో రాకపోకలకు ఇబ్బందులు తలెత్తాయి

కిన్నెరసాని ప్రాజెక్టు రెండు గేట్లు ఎత్తివేత

పాల్వంచరూరల్: ఎగువన కురుస్తున్న వర్షాలతో కిన్నెరసాని జలాశయానికివరద ఉధృతి పెరగగా, శుక్రవారం నీటి మట్టం 405.80 అడుగులకు చేరింది. 407 అడుగుల నీటి నిల్వ సామర్థ్యం కలిగిన రిజర్వాయర్‌లోకి ఇన్‌ఫ్లో 4500 క్యూసెక్కులు ఉండగా, రెండుగేట్లను ఎత్తి ఉంచి 10 వేల క్యూసెక్కుల నీటిని గోదావరిలోకి విడుదల చేస్తున్నట్లు ఏఈ తెలిపారు.


నీట మునిగిన పర్ణశాల నారచీరల ప్రాంతం

తాలిపేరుకు మళ్లీ వరద

చర్ల: తాలిపేరు మధ్య తరహా ప్రాజెక్ట్‌లోకి వరద ఉధృతి పెరిగింది. ఎగువ ప్రాంతమైన ఛత్తీస్‌గఢ్‌లో రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో వరదనీరు వచ్చి చేరుతోంది. 15 గేట్లను ఎత్తి ప్రాజెక్ట్ నుంచి 20,753 క్యూసెక్కుల నీటిని దిగువన గోదావరిలోకి విడుదల చేస్తున్నారు. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటి మట్టం 74 మీటర్లుకాగా, వరద ఉధృతి దృష్ట్యా 73.59 మీటర్లుగా క్రమబద్ధీకరిస్తున్నట్లు డీఈ తిరుపతి తెలిపారు.

ఎస్టీ కమిషన్ విచారణకు అధికారుల గైర్హాజరు

ఇల్లెందురూరల్: జేకేఓసీ విస్తరణలో భాగంగా గిరిజనుల సాగుభూమి విషయంలో జాతీయ ఎస్టీ కమిషన్ ఆధ్వర్యంలో శుక్రవారం హైదరాబాద్‌లో నిర్వహించిన విచారణకు బాధిత రైతులు హాజరు కాగా సింగరేణి అధికారులు గైర్హాజరయ్యారు. మండలంలోని పూసపల్లి గ్రామ సమీపంలో విజయలక్ష్మీనగర్ గ్రామపంచాయతీలో గిరిజనులు సాగుచేస్తున్న సర్వే నంబర్ 588/2 పరిధిలో ఉన్న 7.03 ఎకరాల విస్తీర్ణంపై సింగరేణి అధికారులు అనుసరిస్తున్న తీరును రైతులు జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు జాటోత్ హుస్సేన్‌నాయక్‌కు వివరించారు. గతంలో రెవెన్యూ, అటవీశాఖల అధికారులు సాగులో ఉన్న తమకు పట్టాల మంజూరులో ఒకరిపై మరొకరు నెపం పెట్టుకొని అన్యాయం చేశారని వాపోయారు. ప్రస్తుతం పట్టాలు లేవన్న సాకుతో రెవెన్యూ అధికారులు తమ నుంచి భూమిని స్వాధీనం చేసుకుని, సింగరేణికి అప్పగించినట్లుగా తమకు నోట్ పంపారని తెలిపారు. ఎస్టీ కమిషన్ సభ్యుడు హుస్సేన్‌నాయక్ స్పందిస్తూ విచారణకు సింగరేణి అధికారులు హాజరు కానందున మరో సమన్లు జారీ చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మహాశక్తి ఆర్గనైజేషన్ అధ్యక్షుడు మాలోత్ దిలీప్, 21పిట్ ఏరియా అఖిలపక్ష కమిటీ నేతలు పూనెం సురేందర్, వడ్ల శ్రీనివాస్, బాధిత రైతులు పాల్గొన్నారు.


ఎస్టీ కమిషన్ సభ్యుడు హుస్సేన్‌నాయక్‌తో రైతులు

4,104 కేజీల నల్లబెల్లం స్వాధీనం

ఏపీ నుంచి తరలిస్తుండగా పట్టుకున్న అధికారులు

అశ్వారావుపేటరూరల్: సారా తయారీకి ఉపయోగించే నల్లబెల్లం, పటికతో పాటు నాటుసారా తరలిస్తున్న ఓ వాహనాన్ని ఖమ్మం జిల్లా ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు పట్టుకున్నారు. దసరా సందర్భంగా సారా తయారీకి అవకాశముందనే సమాచారంతో నల్లబెల్లం రవాణాను అడ్డుకునేందుకు స్పెషల్ డ్రైవ్ చేపడుతున్నారు. ఈ మేరకు అశ్వారావుపేటలోని చెక్‌పోస్టు వద్ద శుక్రవారం తెల్లవారుజామున ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్‌ఐ సీహెచ్ శ్రీహరి ఆధ్వర్యాన తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో ఏపీ రాష్ట్రంలోని తూర్పుగోదావరి జిల్లా నుంచి తెలంగాణలోకి వస్తున్న టాటా ఇంట్రా వాహనాన్ని తనిఖీ చేయగా 4,104 కేజీల నల్లబెల్లం, 30 కేజీల పటిక, 10 లీటర్ల నాటుసారా లభించాయి.


పట్టుబడిన వాహనం, నిందితులతో ఎక్సైజ్ ఉద్యోగులు

ఏపీలోని తూర్పుగోదావరి జిల్లాకు చెందిన కొడమంచిలి క్రాంతి, నవరపు రవి, పులిదిండి హరీశ్ అశ్వారావుపేటకు వీటిని తరలిస్తున్నట్లు గుర్తించి ఇద్దరిని అదుపులోకి తీసుకోగా హరీశ్ పరారీలో ఉన్నాడు. తనిఖీల్లో హెడ్‌కానిస్టేబుల్ కరీం, సిబ్బంది సుధీర్, వెంకట్, ఉపేందర్ పాల్గొన్నారు.

దాడి చేసిన వ్యక్తిపై కేసు

పాల్వంచరూరల్: తన పంట చేనులోకి వచ్చిన కోతులను రైతు కొట్టడంతో అవి పక్కన ఉన్న మరో చేనులోకి వెళ్లాయి. ఆ రైతు వచ్చి పక్క రైతుతో గొడవపడ్డాడు. ఈ క్రమంలో ఓ రైతు కర్రతో దాడి చేయడంతో పోలీసులు కేసు నమోదు చేశారు. మండలంలోని నాగారం గ్రామపంచాయతీ భోజ్యాతండాకు చెందిన భూక్యా బాలాజీ పత్తి చేనులో కోతులు పడ్డాయని సమాచారం రాగా వెళ్లాడు. పంటచేనులో ఉన్న కోతులను బయటకు తరిమాడు. అవి కాస్తా పక్కన ఉన్న మరో పత్తిచేనులోకి వెళ్లాయి. అది గమనించిన రైతు ధర్మసోత్ రాము తన పంటచేనులోకి కోతులను ఎందుకు మళ్లించావంటూ బాలాజీతో వాగ్వాదానికి దిగాడు. కర్రతో దాడి చేశాడని బాలాజీ ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ సురేశ్ తెలిపారు.

పెళ్లి చేసుకుంటానని మోసం చేశాడు..

బాధితురాలి ఆవేదన.. అండగా మహిళా సంఘాలు

మణుగూరుటౌన్: ప్రేమించి, వివాహం చేసుకుంటానని నమ్మించడంతో కలిసి ఉంటున్నామని, అతడికి మరో మహిళతో గతంలో వివాహం జరిగిందని తెలిసి ప్రశ్నించేందుకు వచ్చిన తనపై దాడి చేసి హత్యాయత్నం చేశారని, తనకు న్యాయం చేయాలని ఓ యువతి తెలిపింది. శుక్రవారం బాధితురాలు విలేకరులతో వివరాలు వెల్లడించింది. మండలంలోని వాగుమల్లారానికి చెందిన మట్టా గణేశ్‌తో ఏపీ రాష్ట్రం కడప శివారుకు చెందిన యువతికి మూడేళ్ల కిందట బెంగుళూరులో ఏర్పడిన పరిచయం ప్రేమగా మారింది. రెండేళ్లు బెంగుళూరులో ఆ తర్వాత ఏడాది నుంచి హైదరాబాద్ షేక్‌పేటలో కలిసి ఉంటున్నారు. కొద్దికాలంగా అతని ప్రవర్తనలో మార్పు రాగా, అనుమానంతో ఆరా తీయగా, వివాహం జరిగి పిల్లలు ఉన్నట్లు తెలిసిందని, ఈ విషయమై ప్రశ్నించేందుకు వాగు మల్లారంలోని గణేశ్ ఇంటికి జూలై 15న రాగా తనను విచక్షణా రహితంగా అతడి భార్య మట్టా రాశిశుక్రియా, ఆమె తల్లి గొడుగు రమాదేవి, గణేశ్ తండ్రి కలిసి హత్యాయత్నం చేశారని బాధితురాలు వెల్లడించింది. తన వద్ద పలు దఫాలుగా రూ.10 లక్షలు తీసుకున్నాడని ఆధారాలు చూపింది. అనారోగ్యం పాలయ్యానని పేర్కొంది. కాగా, కడప జిల్లాకు చెందిన యువతి మండలంలోని మహిళా సంఘాలను ఆశ్రయించడంతో అండగా నిలిచాయి. దిశ, రేణుక అక్షర మహిళా మండలి, సఖి ప్రతినిధులు మట్టా గణేశ్‌తో పాటు యువతిపై దాడికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. అనంతరం స్థానిక డీఎస్పీ రవీందర్‌రెడ్డికి యువతితో కలిసి ఫిర్యాదు చేశారు. సమావేశంలో పూనెం సరోజ, షబానా, కోరి శ్యామల, బొడ్డు సౌజన్య, సుజాత, రేణుక, దేరంగుల సుజాత, కన్నాపురం వసంత, దిశ అధ్యక్షురాలు అనిత, సఖి మండలి నాయకురాలు భోగినేని వరలక్ష్మి, బత్తుల సుజాత, బీసీ మహిళా కమిటీ మండల అధ్యక్షురాలు కవిత, శిరీష, నర్సమ్మ, రోహిణి, జయమ్మ తదితరులు ఉన్నారు.


వివరాలు చెబుతున్న బాధితురాలు, మహిళా సంఘాల బాధ్యులు

అధికారులతో రైతుల వాగ్వాదం

జూలూరుపాడు: మండలంలోని పడమటనర్సాపురం రైతువేదికలో గురువారం యూరియా కోసం రైతులు, అధికారుల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. క్యూలైన్‌లో లేని కొందరు రైతులకు యూరియా బస్తాలు ఇవ్వడంతో సహకార సంఘం అధికారులతో రైతులు వాగ్వాదానికి దిగారు. తెల్లవారుజాము నుంచి క్యూలైన్‌లో వేచి ఉన్నామని, అన్నం, నీళ్లు లేకుండా ఉంటే తమకు ఇవ్వకుండా పలుకుబడి ఉన్నవారికి యూరియా ఎలా ఇస్తారంటూ నిలదీశారు. సోమవారం కూపన్ ఇచ్చిన రైతులకు యూరియా ఇస్తాన్నామని అధికారులు చెప్పగా, తాము కూడా సోమ, మంగళవారం ఆధార్, పట్టాపాస్ బుక్ జిరాక్స్‌లు ఇచ్చామని, ఇప్పుడు వచ్చిన వారికి ఎలా ఇస్తారని ప్రశ్నించారు. ఈ క్రమంలో అధికారులకు, రైతులకు మధ్య స్వల్ప వాగ్వాదం చోటుచేసుకుంది. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడకు చేరుకొని, రైతులకు నచ్చజెప్పడంతో వివాదం సద్దుమణిగింది. వరుస క్రమంలోనే యూరియా పంపిణీ చేస్తున్నామని, సోమవారం కూపన్ ఇచ్చిన రైతులకే యూరియా ఇచ్చామని జూలూరుపాడు సహకారం సంఘం కార్యదర్శి రమణారెడ్డి వెల్లడించారు. రైతులు సహకరించాలని కోరారు.

కలప పట్టివేత


స్వాధీనం చేసుకున్న కలప దుంగలతో అధికారులు

దుమ్ముగూడెం: మండలంలోని ఆర్లగూడెం సెక్షన్ పరిధిలోని గుర్రాలబైలు శివారులో అక్రమంగా దాచి ఉంచిన కలపను అటవీశాఖ అధికారులు శుక్రవారం స్వాధీనం చేసుకున్నారు. గ్రామ శివారులో అక్రమంగా కలప దాచి ఉంచారనే సమాచారంతో భద్రాచలం రేంజర్ కె.రంజిత ఆధ్వర్యంలో సిబ్బంది దాడి చేశారు. కలపను పట్టుకుని రేంజ్ కార్యాలయానికి తరలించారు. స్వాధీనం చేసుకున్న కలప విలువ సుమారు రూ.2 లక్షలు ఉంటుందని తెలిసింది. దాడిలో ఆర్లగూడెం డీఆర్వో డి.కృష్ణ, భద్రాచలం సెక్షన్ అధికారి వీరస్వామి, బీట్ అధికారులు కుమార్, బుచ్చా, రేంజ్ సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి

బూర్గంపాడు: మండలంలోని మోతె పట్టీనగర్ వద్ద శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మేకల కాపరి మృతి చెందాడు. స్థానికుల కథనం ప్రకారం.. మోతె గ్రామానికి చెందిన పాశం శేషు (54) శుక్రవారం మేకలను మేపుకుని ఇంటికి వస్తున్న క్రమంలో భద్రాచలం వైపు వెళ్తున్న ఆటో అతడిని ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడిన శేషును స్థానికులు భద్రాచలం ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శేషు మృతిచెందాడు. మృతుడి కుమారుడు ఆరు నెలల క్రితం అనారోగ్యంతో మృతి చెందాడు. మృతుడికి భార్య, కోడలు, మనువడు, మనువరాలు ఉన్నారు. శేషు మృతితో మోతె గ్రామంలో విషాదం అలుముకుంది. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

ఆగిఉన్న లారీని ఢీకొట్టిన బైక్

తీవ్రంగా గాయపడిన యువకుడు


రోడ్డుపై నిలిపిన లారీ పక్కనే ఆటో, బైక్

మణుగూరుటౌన్: బొగ్గు తరలిస్తున్న లారీలో లోపాలు తలెత్తడంతో రోడ్డుపైనే నిలిపారు. వెనుక నుంచి వచ్చిన ఆటో లారీని ఢీకొట్టగా.. పక్కకు తీస్తున్న క్రమంలో మరో వ్యక్తి బైక్‌తో వచ్చి ఢీకొట్టి తీవ్రంగా గాయపడ్డాడు. ఈ ఘటన మండలంలో శుక్రవారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. బీటీపీఎస్‌కు మణుగూరు నుంచి బొగ్గు తరలిస్తున్న ఓ టిప్పర్ తెల్లవారుజామున విజయనగరం గ్రామం నాగులమ్మ ఆలయ సమీపంలో నడిరోడ్డుపై నిలిచిపోయింది. లారీ ఆగి ఉన్నట్లు ఎలాంటి గుర్తులు పెట్టకపోవడంతోపాటు సిగ్నల్ లైట్లు లేకపోవడంతో వెనుక నుంచి వచ్చిన ఆటో వేగంగా ఢీకొట్టింది. ఆటోను పక్కకి తొలగిస్తున్న క్రమంలో ఓటీ కంపెనీలో ప్రైవేట్ సెక్యూరిటీ గార్డుగా విధులు పూర్తిచేసుకున్న కంచర్ల ప్రవీణ్ బైక్‌పై వచ్చి లారీని ఢీకొట్టాడు. తలకు తీవ్రగాయం కావడంతో చికిత్స నిమిత్తం స్థానికులు మణుగూరు ఏరియా ఆస్పత్రికి అక్కడి నుంచి భద్రాచలం, ఖమ్మం తరలించారు. ఆటో నడుపుతున్న వ్యక్తికి స్వల్ప గాయాలు కాగా, వివరాలు తెలియరాలేదు. ప్రవీణ్ పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది. మణుగూరు పోలీసులను రోడ్డు ప్రమాద విషయమై సంప్రదించగా ఫిర్యాదు అందలేదన్నారు.



• కేరెంటింగ్

మాటే... బాట

జీవితంలో ఎదురయ్యే అనేక సంఘటనల గురించి తల్లిదండ్రులు తరచూ పిల్లలతో మాట్లాడుతూ ఉండాలి. మన మాటలతోనే వారి బంగారు భవిష్యత్తుకు బాటలు వేయాలి. ఆ మాటలు ఎలా ఉండాలంటే...

ఒక వ్యక్తి ప్రవర్తన వారు చూసిన, దగ్గరగా మసలిన వ్యక్తులు, వారి చుట్టూ ఉన్న ప్రపంచంపై ఆధారపడి ఉంటుంది. ముఖ్యంగా బాల్యంలో పరిసరాలు, మనుషుల ప్రభావం అధికంగా ఉంటుంది. అందుకే పిల్లలు తరచూ అనేక ఆలోచనలు, సందేహాలతో సతమతమవుతుంటారు. ఇవి ఒకదాన్ని ఒకటి డామినేట్ చేస్తుంటాయి. ఇలాంటి పరిస్థితుల్లో ఉన్న పిల్లలను తల్లిదండ్రులు జాగ్రత్తగా గమనిస్తుండాలి.

అంతర్గత సౌందర్యమే అసలైన అందం

పిల్లలు టీనేజ్ లేదా యుక్తవయసుకు వచ్చినపుడు వారిలో ఆత్మవిశ్వాసం పాళ్లు చాలా తక్కువగా ఉంటాయి. అన్ని విషయాల్లో ఇతరులతో పోల్చుకుని వారి కన్నా తాము తక్కువని ఫీలవుతుంటారు. శరీరం రంగు విషయంలో ఇది మరింత ఎక్కువగా ఉంటుంది. దీన్ని ఆ వయసులో వారికి అర్థమయ్యేలా వివరించడం కొంత కష్టం అయినప్పటికీ అందం తాత్కాలికమని, అసలు అందం అంటే తెలుపు, నలుపు రంగులకు సంబంధించిన విషయం కాదని చెప్పాలి. అలాగే ఎత్తు, బరువు, ఆకృతి అందచందాలకు గుణగుణాలకు కొలమానం కాదని, అంతర్గత సౌందర్యం మాత్రమే అసలైన అందమని వారికి విడమరచి చెప్పాలి. మన ప్రతిభను ప్రపంచానికి చూపేందుకు అనేక మార్గాలున్నాయని వారికి తెలియజెప్పాలి.

మీ కలలకు మేం రంగులద్దుతాం!

కలలు కనడం ఏమీ చెడ్డ విషయం కాదు. అయితే అవి ఆచరణసాధ్యం కానివి...పరిమితికి మించినవి కావడం మాత్రం కష్టంగా అనిపించే విషయం. పిల్లలు తాము ఎలా ఉండాలి? ఎవరిలా ఉండాలి... అనే విషయం గురించి తరచూ ఆలోచిస్తుంటారు. కొందరు పిల్లలు తమ తల్లిదండ్రుల్లా ఉండాలని కోరుకుంటారు. మరికొందరు అంతకంటే మిన్నగా బతకాలని, ఉద్యోగ, వ్యాపార రీత్యా ఇంకా ఉన్నతస్థాయిలో ఉండాలని కోరుకుంటారు. తల్లిదండ్రులు తమ పిల్లలు ఇలాగే ఉండాలని శాసించకూడదు. వారి ఆలోచనలను తెలుసుకుని, కలలను సాకారం చేసుకోవడంలో తోడ్పడాలి. తమను తాము తీర్చిదిద్దుకునేందుకు అవసరమైన సలహాలు మాత్రమే ఇవ్వాలి. ఒకవేళ వారికి ఈ విషయంలో స్పష్టత లేకపోతే నిర్ణయాలు తీసుకోవడంలో సహకరించాలి.

ఎలాంటి స్నేహాన్ని ఎంచుకోవాలంటే..?

మిత్రలాభం, సావాస దోషం ఈ రెండూ స్నేహం వల్ల కలిగే లాభ నష్టాలను సూచించే పదాలు. ఎందుకంటే స్నేహం పిల్లలను అమితంగా ప్రభావితం చేస్తుంది. ఒకేవ్యక్తితో సావాసం చేయడం అన్నివేళలా అంత మంచిది కాదు. పెరుగుతున్న కొద్దీ స్నేహాలు కొంత క్లిష్టంగా మారుతుంటాయి. అందుకే తోటివారినెవరినీ విడదీసి చూసి ఎంపిక చేసుకునే బదులు అందరితో కలివిడిగా ఉండటం నేర్పాలి.. మంచి స్నేహితులు ఎప్పుడూ మిమ్మల్ని తక్కువగా చూడరు. అగౌరవపరచరు. మీ స్నేహాన్ని ఆస్వాదిస్తారు.. విశ్వాసపాత్రులుగా ఉంటారని వారికి వివరించి చెప్పాలి.

పోల్చిచూడవద్దు

కోరికలు, అవసరాలకు అంతనేది ఉండదు. మన దగ్గర ఉన్నదాంట్లో తృప్తి పడటం నేర్చుకోవాలి. అందుకు సదా కృతజ్ఞులమై ఉండాలి. అంతే తప్ప తోటివారితో పోల్చుకుని వారి వద్ద ఉన్నవి, అనుభవిస్తున్నవి మన దగ్గర లేవని బాధపడకూడదని చెబుతుండాలి.

ప్రవర్తనా లోపాలు ఉండరాదు

కొంతమంది పిల్లలు తోటి విద్యార్థులను బెదిరిస్తుంటారు. తల్లిదండ్రులను చిన్నచూపు చూస్తూ అవమానిస్తుంటారు. ఈ ప్రవర్తనను మొగ్గలోనే తుంచి వేయాలి. లేకపోతే మనం అమ్మానాన్నలుగా విఫలం అయినట్లే లెక్క. ఇతరులను బెదిరించడం, ఎగతాళి చేయడం తప్పని, పైగా అది ఇతరులకే కాదు, వారికి కూడా ఎంతో హాని కలిగించే విషయం కూడానని చెప్పాలి. అందుకే ఇంటిని, బడిని పిల్లలకు సురక్షితమైన ప్రదేశాలుగా ఉంచటం అత్యవసరం.

ప్రతి ఒక్కరినీ గౌరవించాలి

దేవుడు మానవుల ఆత్మల్లో కొలువై ఉంటాడని, ఒకరికొకరు సాయం చేసుకోవడం, ఇతరులను గౌరవించడం నిజమైన దైవారాధన అని రవీంద్రనాథ్ ఠాగూర్ తరచూ బోధించేవారు. ఇలాంటి మహనీయుల ఆదర్శ వాక్యాలను పిల్లల మనసులో నాటుకునేలా తల్లిదండ్రులు పదే పదే చెబుతుండాలి.స్థాయీ భేదాలు, లైంగిక తారతమ్యాలు లేకుండా ప్రతి ఒక్కరినీ సమానంగా గౌరవించాలని చెప్పాలి. ఎవరూ తక్కువ కాదని, స్త్రీలు లైంగిక వస్తువులు కాదు... పురుషులంటే వారిని హింసించే వేటగాళ్లు కాదు... ఎవరూ ఎవరికీ సేవకులు లేదా బానిసలు కాదని చెప్పాలి.

సంతోషమే ఏకైక మార్గం

మనస్సును ఎల్లప్పుడూ సంతోషంగా ఉంచుకోవాలి. ఎవరైనా సంతోషంగా ఉండాలంటే మీ ముందున్న ఏకైక మార్గం మీ తోటివారిని సంతోషంగా ఉంచడమేనని తెలియజెప్పాలి.

అభిరుచులూ ముఖ్యమే!

చదువుకు అడ్డం అంటూ పిల్లలను క్రీడలు, లలిత కళలు లేదా ఇతర అభిరుచులకు దూరం చేయకూడదు. ఇవేమీ లేకుండా కేవలం చదువు ఒక్కటే లక్ష్యంగా పెట్టుకోవాలి, మరే అభిరుచులూ ఉండకూడదంటే అది వారిని తీవ్ర నిరుత్సాహానికి గురిచేస్తుందని గుర్తుంచుకోండి

మంచితనమే మిన్న

ఏమి జరుగుతుందో అది జరుగుతుంది. మనం ఏం చేస్తే అదే మనకు తిరిగొస్తుంది. అది మంచయినా... చెడయినా... అందుకే ఎప్పుడూ తోటివారితో సామరస్యంతో, మంచితనంతో ఉండాలని పిల్లలకు నేర్పించాలి.

లైఫ్@360

• అయ్యంగార్ యోగ

మల్లిక ఫిట్‌నెస్ మంత్ర



48 సంవత్సరాల వయస్సులో కూడా చక్కటి సౌష్టవంతో యువ నటీమణులతో పోటీపడుతున్న బాలీవుడ్ నటి మల్లికా షెరావత్. ఆమె తనను ఫిట్‌గా ఉంచే అయ్యంగార్ యోగా సాధన గురించి ఇటీవల ఇన్‌స్టాలో పోస్ట్ చేసింది.

వేగంగా బరువు తగ్గాలని, తొందరగా ఫిట్‌నెస్ పెంచుకోవాలని ఇంచుమించు అందరూ అనుకుంటారు. అయితే అలాంటి క్విక్-ఫిక్స్ డైట్‌లు, ట్రెండింగ్ వర్కౌట్‌లు, సోషల్ మీడియా ట్రిక్స్ మూలంగా వచ్చిన ఫిట్‌నెస్ అంతే తొందరగా కరిగిపోతుందని తెలుసుకోలేక చాలామంది స్థిరమైన ఫిట్‌నెస్ మార్గాన్ని గాలికి వదిలేస్తుంటారు.

నా ఫిట్‌నెస్ ఫిలాసఫీ

"నా ఆరోగ్యానికి, ఫిట్‌నెస్‌కు యోగా చేయడమే కారణం. అంతేగానీ ఫ్యాషన్ డైట్‌లు లేదా క్రాష్ ప్రోగ్రామ్‌లు కాదు' అని మల్లిక ఇన్‌స్టా సాక్షిగా తేల్చి చెప్పింది. ఆరోగ్యంగా ఉండాలన్న తపన.. క్రమశిక్షణ, స్థిరత్వం తన అతి పెద్ద సాధనాలని నొక్కి చెప్పింది. ట్రెండీ ఫిట్‌నెస్ హ్యాక్‌లను ఆమోదించే చాలా మంది సెలబ్రిటీల మాదిరిగా కాకుండా, మల్లికా దీర్ఘకాలిక అలవాట్లను పెంపొందించుకోవడం వైపే మొగ్గు చూపుతుంది. అందుకే అయ్యంగార్ యోగాను తన దినచర్యలో భాగంగా మార్చుకుంది.

ఫిట్‌నెస్‌ను తాను తాత్కాలికంగా తీసుకోలేదని, దానిని తన జీవనశైలిలో భాగంగా చేసుకున్నానని చెబుతూనే, అయ్యంగార్ యోగా వల్ల తన శరీరాన్ని షేప్ కోల్పోకుండా ఉంచుకోవడమే కాకుండా, తన బిజీ జీవితంలో సమతుల్యతను కాపాడుకోవడానికి, ముఖ్య విషయాల మీద దృష్టి పెట్టడానికి సహాయపడిందని ఆమె ఈ సందర్భంగా గుర్తు చేసుకుంది.

ఏమిటీ అయ్యంగార్ యోగా?

అయ్యంగార్ యోగకూ పతంజలి ఋషి యోగ సూత్రాలకూ అవినాభావ సంబంధం ఉంది. అష్టాంగ యోగా ఎనిమిది అంశాలను ఆచరణాత్మక వ్యవస్థలో మిళితం చేస్తుంది. అధికారిక అయ్యంగార్ యోగా వెబ్‌సైట్ ప్రకారం, దాని క్రమం, ఆధారాల ఉపయోగం, భద్రతపై ప్రాధాన్యత దీనిని ప్రపంచవ్యాప్తంగా అత్యంత విస్తృతంగా అభ్యసించే యోగా రూపాలలో ఒకటిగా మార్చాయి.

అయ్యంగార్ యోగాలో కీలకమైన అంశం ఏమిటంటే పట్టీలు, బోల్‌స్టర్లు, బ్లాక్స్, తాళ్లు వంటి ఆధారాలను ఉపయోగించడం. ఈ సాధనాలు ప్రారంభకులకు అధునాతన అభ్యాసకులకు సరైన భంగిమను సాధించడంలో సహాయపడతాయి. అదే సమయంలో గాయం ప్రమాదాలను తగ్గిస్తాయి. ఇది అభ్యాసాన్ని అత్యంత సమగ్రంగా చేస్తుంది. అన్ని వయసుల వారికి, ఫిట్‌నెస్ స్థాయిలకు అనుకూలంగా ఉంటుంది.

మెదడుకు చురుకైన ఆహారం



రోజువారీ ఆహారంలో కూరగాయలు, లీన్ ప్రోటీన్లు, మంచి కొవ్వు, మరిన్ని... దశాబ్దాలుగా, మెడిటేరియన్ డైట్ తీసుకోవడం వల్ల మెదడు వృద్ధాప్యాన్ని వాయిదా వేయవచ్చని నిపుణులు చెబుతున్నారు.

గ్రీన్ టీ: ఇది మీ న్యూరాన్లకు శక్తినిస్తుంది: గ్రీన్ టీలో కాటెచిన్లు పుష్కలంగా ఉన్నాయి, ఇవి వాపులను, ఆక్సీకరణ ఒత్తిడిని తగ్గించడానికి కావలసిన శక్తివంతమైన యాంటీ ఆక్సిడెంట్లు, ఇవి న్యూరోడీజనరేషన్‌కు కీలకంగా పనిచేస్తాయి.

మెదడు పనితీరును పెంచే మొక్క మన్కై

దీనిని 'డక్ వీడ్' అని కూడా పిలుస్తారు, మన్కై అనేది పాలీఫెనాల్స్, బీ12, మొక్కల ఆధారిత ప్రోటీన్లతో నిండిన ఒక చిన్న వాటర్ ప్లాంట్. ఇది మెదడు వృద్ధాప్యంతో ముడిపడి ఉన్న కీలక ప్రోటీన్‌లను నియంత్రించడంలో సహాయ పడుతుంది.

చెడును తొలగిస్తుంది, మంచిని జోడిస్తుంది

గ్రీన్-మెడ్ ప్రణాళిక ఆరోగ్యకరమైన పదార్థాలపై మాత్రమే కాదు, ఇది రెడ్ మీట్, శుద్ధి చేసిన కార్బోహైడ్రేట్‌లను కూడా తగ్గిస్తుంది, రెండూ వృద్ధాప్యంతో ముడిపడి ఉన్నాయి.

మెడిటరేనియన్ డైట్ అంటే...

పుష్కలంగా పండ్లు, కూరగాయలు, బ్రెడ్ ఇతర ధాన్యాలు, బంగాళదుంపలు, బీన్స్, గింజలు, ఆలివ్ నూనెనే ఎక్కువగా వాడతారు. పాల ఉత్పత్తులు, గుడ్లు, చేపలు వంటివి మెడిటరేనియన్ డైట్ లో మితంగా తీసుకుంటారు. ఈ ఆహారంలో రెడ్ మీట్ కంటే చేపలు, పౌల్ట్రీ ఉత్పత్తులు ఎక్కువగా ఉంటాయి. మొక్కల ఆధారిత ఆహారాలనే ఎక్కువగా తింటారు.



వ్యాపించకుండానే వాష్ చేసేద్దాం

అంటువ్యాధులతోపాటు రకరకాల సీజనల్ వ్యాధుల వ్యాప్తిని, ఇన్ఫెక్షన్లను నివారించడానికి అతి తేలికైన, అత్యంత ప్రభావవంతమైన మార్గాలలో ఒకటి 'హ్యాండ్‌వాష్'. అవును, నిజమే. చేతుల పరిశుభ్రత వల్ల జీర్ణకోశ వ్యాధులు. శ్వాసకోశ ఇన్ఫెక్షన్లు గణనీయంగా తగ్గుతాయని శాస్త్రీయ అధ్యయనాలు చూపిస్తున్నాయి. సబ్బుతో చేతులు కడుక్కోవడం, ముఖ్యంగా టాయిలెట్ ఉపయోగించిన తర్వాత, తినడానికి ముందు, చర్మంపై ఉన్న చాలా సూక్ష్మజీవులను సమర్థంగా తొలగించగలదు. ముఖ్యంగా వర్షాకాలంలో, వర్షంలో తడిసినప్పుడు చేతులు శుభ్రంగా కడుక్కోవడం వల్ల వ్యాధుల వ్యాప్తి గణనీయంగా తగ్గుతున్నట్లు అధ్యయనంలో రుజువైంది.

సాక్షి సినిమా



• ప్రభాస్



• మహేశ్‌బాబు



• ఎన్టీఆర్



• రామ్‌చరణ్



• నాని

మిషన్ మేకోవర్

కథ డిమాండ్ మేరకు సినిమా సినిమాకు కొత్త లుక్స్‌లోకి మారిపోతుంటారు హీరోలు. కథల్లోని హీరో క్యారెక్టరైజేషన్‌కు తగ్గట్లుగా గెటప్ మార్చేస్తుంటారు. ఇలా తమ కొత్త సినిమాల కోసం కొందరు హీరోలు ఒక 'మిషన్' మీద ఉన్నారు. ఆ మిషన్ ఏంటంటే 'మేకోవర్'. ఈ 'మిషన్ మేకోవర్' విశేషాలు తెలుసుకుందాం.

రాముడి పాత్రలో..?

సిల్వర్ స్క్రీన్‌పై లాంగ్ హెయిర్, గడ్డంతో మహేశ్‌బాబు కనిపించి చాలా సంవత్సరాలైంది. ఇప్పుడు రాజమౌళి దర్శకత్వంలో చేస్తున్న 'ఎస్‌ఎస్‌ఎమ్‌బీ29' (వర్కింగ్ టైటిల్) సినిమా కోసం మహేశ్ బాబు పూర్తిగా మేకోవర్ అయ్యారు. హెయిర్, గడ్డం పెంచారు. అలాగే వర్కౌట్స్‌తో ఫిజికల్‌గా కూడా ధృడంగా తయారయ్యారు. కాగా ఈ కథకు మైథలాజికల్ టచ్ కూడా ఉందని, ఈ చిత్రంలో రాముడి పాత్రలో మహేశ్‌బాబు కనిపిస్తారనే టాక్ కూడా ప్రచారంలోకి వచ్చింది. ఈ వార్త నిజం అయితే 'ఎస్‌ఎస్‌ఎమ్‌బీ29'లో మహేశ్ బాబును ప్రేక్షకులు పలు రకాల లుక్స్‌లో చూసే అవకాశం ఉంది. ఈ సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. ఈ ఏడాది నవంబరులో ఈ సినిమా అప్‌డేట్‌ను ఇస్తామని రాజమౌళి చెప్పారు. నవంబరులో ఈ సినిమా టైటిల్, ఫస్ట్ లుక్‌ను రిలీజ్ చేస్తారని భోగట్టా. దాదాపు రూ. 1000 కోట్ల బడ్జెట్‌తో రూపొందుతున్న ఈ సినిమా 2027 మార్చిలో విడుదల కానుందనే ప్రచారం సాగుతోంది.

పోలీస్ ట్రైనింగ్

ప్రభాస్ ప్రస్తుతం 'ది రాజాసాబ్, ఫౌజి' (ప్రచారంలో ఉన్న టైటిల్) చిత్రాలతో బిజీగా ఉన్నారు. ఈ సినిమా తర్వాత సందీప్ రెడ్డి వంగా దర్శకత్వంలోని 'స్పిరిట్' సినిమా షూటింగ్‌లో పాల్గొంటారు ప్రభాస్. ఈ చిత్రంలో ప్రభాస్ పోలీసాఫీసర్ పాత్రలో నటించనున్నారు. ఈ హీరో పోలీస్‌గా కనిపించనున్న తొలి చిత్రం ఇదే. దీంతో 'ది రాజాసాబ్, ఫౌజి' చిత్రాల షూటింగ్ పూర్తికాగానే, 'స్పిరిట్'లో పవర్‌ఫుల్ పోలీస్ లుక్ కోసం ప్రభాస్ మేకోవర్ కావాల్సి ఉంది. ఇందుకోసం ఆయన ఇంటెన్స్ ట్రైనింగ్ తీసుకోనున్నారట. ఈ చిత్రంలో 'యానిమల్' ఫేమ్ త్రిప్తి దిమ్రి హీరోయిన్‌గా నటించనున్నారు. ఇండియాలోని ప్రముఖ లోకేషన్స్‌తో పాటు మెక్సికో, యూకే వంటి విదేశీ లొకేషన్స్‌లోనూ 'స్పిరిట్' చిత్రీకరణ జరగనుంది. టీ సిరీస్ ఫిలింస్, భద్రకాళి ప్రొడక్షన్స్ పతాకాలపై భూషణ్ కుమార్, ప్రణయ్ రెడ్డి వంగా ఈ చిత్రాన్ని నిర్మించనున్నారు.

బరువు తగ్గాలని...

ఎన్టీఆర్ హెవీ వర్కౌట్స్ చేస్తున్న ఓ వీడియో ఇటీవల వైరల్ అయిన సంగతి తెలిసిందే. ఈ హీరో ఈ రేంజ్‌లో కష్టపడుతున్నది 'డ్రాగన్' (ప్రచారంలో ఉన్న టైటిల్) సినిమా కోసమే. ఎన్టీఆర్ హీరోగా ప్రశాంత్ నీల్ డైరెక్షన్‌లో 'డ్రాగన్' సినిమా తెరకెక్కుతోంది. ఈ పీరియాడికల్ యాక్షన్ డ్రామాలో ఎన్టీఆర్ క్యారెక్టరైజేషన్‌లో డిఫరెంట్ షేడ్స్ ఉంటాయని తెలిసింది. ఆల్రెడీ సినిమా షూటింగ్ కొంత భాగం పూర్తయింది. అయితే కథ రీత్యా ఈ సినిమాలో ఎన్టీఆర్ ఓ డిఫరెంట్ లుక్‌లో కనిపిస్తారట. ఈ లుక్ కోసమే ఎన్టీఆర్ మేకోవర్ అవుతున్నారని తెలిసింది. ఈ లుక్ కోసం బరువు తగ్గే మిషన్ మీద ఉన్నారు. ఇక ఇటీవల ఓ యాడ్ షూటింగ్‌లో భాగంగా ఎన్టీఆర్ స్వల్పంగా గాయపడ్డారు. వైద్యులు ఆయనకు రెండు వారాల పాటు విశ్రాంతి సూచించారు. దీంతో ప్రస్తుతం ఎన్టీఆర్ రెస్ట్ మోడ్‌లో ఉన్నారు. కోలుకున్న తర్వాత తిరిగి ఆయన 'డ్రాగన్' సినిమా షూటింగ్‌లో జాయిన్ అవుతారు. ఈ చిత్రం తదుపరి షెడ్యూల్ విదేశాల్లో ప్రారంభం కానుందని తెలిసింది. రుక్మిణీ వసంత్ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రంలో మలయాళ నటుడు టొవినో థామస్ విలన్ రోల్ చేస్తున్నారనే ప్రచారం సాగుతోంది. కల్యాణ్ రామ్, కె. హరికృష్ణ, నవీన్ ఎర్నేని, వై. రవిశంకర్ నిర్మిస్తున్న 'డ్రాగన్' సినిమా వచ్చే ఏడాది జూన్ 25న విడుదల కానుంది.

ద్విపాత్రాభినయం?

'పెద్ది' సినిమా కోసం బరువు పెరిగారు రామ్‌చరణ్. సరైన వర్కౌట్స్, డైట్‌తో పూర్తిగా కొత్తగా మేకోవర్ అయ్యారు. రామ్‌చరణ్ హీరోగా నటిస్తున్న పీరియాడికల్ మల్టీస్పోర్ట్స్ డ్రామా 'పెద్ది'. ఈ సినిమాలో రామ్‌చరణ్ రెండు డిఫరెంట్ లుక్స్‌లో కనిపించనున్నారని తెలిసింది. ఆల్రెడీ ఈ సినిమా నుంచి రామ్‌చరణ్ ఫస్ట్ లుక్ విడుదలైంది. కానీ ఈ లుక్ కాకుండా మరో లుక్‌లో కూడా రామ్‌చరణ్ కనిపిస్తారు. ఈ రెండో లుక్ కోసమే ఈ హీరో బరువు పెరిగారని తెలిసింది. ఇలా 'పెద్ది'లో రెండు లుక్స్‌లో కనిపించనున్నారనే టాక్ తెరపైకి రావడంతో ఈ చిత్రంలో రామ్‌చరణ్ ద్విపాత్రాభినయం చేస్తున్నారనే ప్రచారం కూడా సాగుతోంది. అలాగే ఈ చిత్రంలో రామ్‌చరణ్ క్యారెక్టరైజేషన్‌లో డిఫరెంట్ వేరియేషన్స్ ఉంటాయని, ఇందులో భాగంగానే డిఫరెంట్ లుక్స్‌లో కనిపిస్తారనే ఊహాగానాలూ ఉన్నాయి. త్వరలో ఈ విషయాలపై ఓ క్లారిటీ వస్తుంది. బుచ్చిబాబు సానా దర్శకత్వంలో సుకుమార్ రైటింగ్స్, మైత్రీ మూవీ మేకర్స్ పతాకాలపై వెంకట సతీష్ కిలారు నిర్మిస్తున్న ఈ చిత్రం 2026 మార్చి 27న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రంలో జగపతిబాబు, శివరాజ్‌కుమార్, దివ్యేందు శర్మ ఇతర ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. ఈ సినిమాకు ఏఆర్. రెహామాన్ సంగీతం అందిస్తున్నారు.

డిఫరెంట్ జడల్

'ది ప్యారడైజ్' ప్రపంచం కోసం పూర్తిగా మారిపోయారు హీరో నాని. 'దసరా' వంటి బ్లాక్‌బస్టర్ మూవీ తర్వాత హీరో నాని, దర్శకుడు శ్రీకాంత్ ఓదెల కాంబినేషన్‌లో రూపొందుతున్న చిత్రం 'ది ప్యారడైజ్'. ఈ సినిమాలో జడల్ అనే డిఫరెంట్ క్యారెక్టర్‌లో నటిస్తున్నారు నాని. ఈ జడల్ పాత్ర కోసం నాని ప్రత్యేకంగా మేకోవర్ అయ్యారు. ఇంటెన్స్ అండ్ హెవీ వర్కౌట్స్‌తో బరువు పెరిగారు. ఇక ఈ పీరియాడికల్ యాక్షన్ డ్రామాలో మోహన్‌బాబు, 'కిల్' ఫేమ్ రాఘవ్ జుయల్ నెగటివ్ రోల్స్ చేస్తున్నారు. సుధాకర్ చెరుకూరి నిర్మిస్తున్న ఈ సినిమా 2026 మార్చి 26న విడుదల కానుంది.

ఇలా తమ కొత్త సినిమాల కోసం లుక్స్, గెటప్స్ మార్చుకున్న, మార్చుకుంటున్న హీరోలు మరికొంతమంది ఉన్నారు.

– ముసిమి శివాంజనేయులు

మా ప్రపంచం వేరు



• ఆయుష్మాన్, రష్మిక

ఆయుష్మాన్ ఖురానా, రష్మికా మందన్నా ప్రధాన పాత్రల్లో నటించిన హారర్ మిస్టరీ రొమాంటిక్ కామెడీ చిత్రం 'థామా'. మడాక్ హారర్ కామెడీ యూనివర్స్‌లో భాగంగా రూపొందిన ఈ చిత్రానికి 'ముంజ్య' ఫేమ్ ఆదిత్య సర్పోత్దార్ దర్శకత్వం వహించారు. దినేష్ విజన్, అమర్ కౌశిక్ నిర్మించారు. ఈ చిత్రంలో అలోక్ పాత్రలో ఆయుష్మాన్ ఖురానా, తడ్కా పాత్రలో రష్మికా మందన్నా నటించారు. ఈ సినిమా ట్రైలర్ లాంచ్ ఈవెంట్ శుక్రవారం ముంబైలో జరిగింది. శ్రద్ధా కపూర్ ముఖ్య అతిథిగా హాజరై ట్రైలర్‌ని లాంచ్ చేశారు. "ఏ... నాటకాలు ఆపు... నీకేం కాలేదు, నా కొడుకు సైతాన్... సైతాన్, నేను నీతో ఉండలేను... మా ప్రపంచం వేరు" అని అర్థం వచ్చే డైలాగ్స్ ఈ హిందీ ట్రైలర్‌లో ఉన్నాయి. దీపావళి పండగ సందర్భంగా 'థామా' సినిమాను అక్టోబరు 21న రిలీజ్ చేయనున్నట్లుగా అధికారికంగా వెల్లడించారు.

వినోదాల విందు



• నవీన్ పొలిశెట్టి, మీనాక్షి చౌదరి

నవీన్ పొలిశెట్టి, మీనాక్షి చౌదరి హీరో హీరోయిన్లుగా నటిస్తున్న ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ సినిమా 'అనగనగా ఒక రాజు'. మారి దర్శకత్వంలో శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ఈ సినిమా వచ్చే సంక్రాంతి సందర్భంగా జనవరి 14న విడుదల కానుంది. శుక్రవారం ఈ సినిమా కొత్త ప్రోమో వీడియోను టీజర్‌లా రిలీజ్ చేశారు మేకర్స్. ఓ ఆభరణాల ప్రకటనకు స్పూఫ్‌గా ఈ ప్రోమోను చేశారు. "తనదైన కామెడీ టైమింగ్‌తో 'అనగనగా ఒక రాజు' సినిమాలో ప్రేక్షకులను అలరించనున్నారు నవీన్ పొలిశెట్టి. ఈ సంక్రాంతికి ప్రేక్షకులకు వినోదాల విందుని హామీ ఇస్తున్నాం" అని చిత్రయూనిట్ పేర్కొంది.

చార్మినార్‌లో సందడి



• లక్ష్య, అనన్యా పాండే

స్టార్ట్ కెమెరా... టేక్ అన్నారు డైరెక్టర్ వివేక్ సోని. అంతే... హీరో లక్ష్య బైక్ స్టార్ట్ చేశారు... వెనకాల హీరోయిన్ అనన్యా పాండే కూర్చున్నారు. రయ్‌మంటూ బైక్ ముందుకు సాగింది. సీన్ పూర్తయింది. షాట్ ఓకే అన్నారు వివేక్. ఈ షూటింగ్ జరిగింది ఎక్కడంటే హైదరాబాద్‌లోని చార్మినార్ దగ్గర. ఎరుపు రంగు సంప్రదాయ దుస్తుల్లో లక్ష్య, అనన్య కలర్‌ఫుల్‌గా కనిపించారు. అక్కడి జనాలు వీరిని గుర్తు పట్టి, చుట్టుముట్టారు. సెల్‌ఫోన్లలో ఫొటోలు, వీడియోలు తీశారు. లక్ష్య, అనన్యా పాండే జంటగా నటిస్తున్న కాలేజ్ రొమాంటిక్ మూవీ 'చాంద్ మేరా దిల్' కోసమే ఈ సన్నివేశాన్ని చిత్రీకరించారు. ఈ చిత్రంలో ఈ ఇద్దరూ ఇంజినీరింగ్ స్టూడెంట్స్ పాత్రల్లో కనిపిస్తారు. ఈ చిత్రం షూటింగ్‌ని వారం రోజుల పాటు హైదరాబాద్‌లో ప్లాన్ చేశారు. చార్మినార్ తర్వాత మరో పాపులర్ ప్లేస్‌లో కీలక సన్నివేశాలు చిత్రీకరిస్తారట. ఈ చిత్రం ఈ ఏడాదే రిలీజ్ కానుంది.

• చార్మినార్ దగ్గర...

